సాక్షి
చిత్తూరు
సోమవారం | 8 | ఏప్రిల్ | 2024



కిడ్నీ బాధితులకు అండగా..

నగరిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో తమ భాదలు తీరాయని కిడ్నీ రోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- IIలో



కిటకిటలాడిన బోయకొండ

పవిత్ర పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలి రావడంతో కిటకిటలాడింది.

- IIలో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సా)	సహర్ మంగళవారం(ఉ)
చిత్తూరు	6.30	4.43
పుంగనూరు	6.32	4.47

న్యూస్‌రీల్

టీడీపీకి కోడ్ వర్తించదా ?



గుడిపాల: రామభద్రాపురంలో వెలసిన తెలుగుదేశం బ్యానర్

గుడిపాల: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి 20 రోజులు గడుస్తున్నా తెలుగుదేశం నాయకులకు మాత్రం ఎన్నికల కోడ్ వర్తించడం లేదు. గుడిపాల మండలంలోని రామభద్రాపురం గ్రామంలో బాలకృష్ణ జన్మదినం అంటూ రామభద్రాపురం సర్పంచ్ గోళ్ల హరిణి, హేమాద్రి నాయడు బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా కూడా వీరు యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘించారు. దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భానుడి ఉగ్రరూపం

చిత్తూరు కలెక్టరేట్: భానుడి భగభగలు ఆదివారం మరింత ఉగ్రరూపం దాల్చాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా సూరీడు తీవ్రస్థాయిలో ప్రభావం చూపుతున్నాడు. ఉష్ణోగ్రతలు ఎక్కువ కావడం, వడగాల్పులతో చిత్తూరు నిప్పుల కొలిమిలా తయారైంది. ఆదివారం జిల్లాలోని తవణంపల్లి మండలంలో అత్యధికంగా 44.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఎండలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలోని 31 మండలాలకు గానూ 17 మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రెండు మండలాల్లో అత్యధికం..

జిల్లాలోని పూతలపట్టు నియోజకవర్గంలో ఉన్న తవణంపల్లి మండలంలో 44.5 డిగ్రీలు, నగరి నియోజకవర్గం నింద్రలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదైంది. అలాగే విజయపురంలో 43.5, శ్రీరంగరాజపురంలో 43.4, నగరిలో 42.8, పులిచెర్లలో 42.6, సోమలలో 42.4, గుడిపాలలో 42.0, పాలసముద్రంలో 42.0, పుంగనూరులో 41.6, యాదమరిలో 41.6, సదుంలో 41.4, చౌడేపల్లిలో 41.1, పెద్దపంజాణిలో 41.3, కార్వేటినగరంలో 41.2, రొంపిచెర్లలో 41.1, గంగాధరనెల్లూరులో 41.0 అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఊచలు లెక్కించాల్సిందే

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగించే ఎన్నికల యంత్రాలకు ఎలాంటి నష్టం కలిగించినా ఊచలు లెక్కించాల్సిందే. మే 13న నిర్వహించే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్, కంట్రోల్ యూనిట్‌ను ఓటు వేసేందుకు వినియోగిస్తారు. ఆ యంత్రాలకు ఎలాంటి నష్టం కలిగినా ప్రజాప్రాతినిధ్యం చట్టం సెక్షన్ 136 ప్రకారం చర్యలు తీసుకుంటారు.

ఆరోగ్యకర జీవితాన్ని ప్రసాదించాలి




మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్

చిత్తూరు రూరల్: పేదలకు ఆరోగ్యకర జీవితాన్ని ప్రసాదించేలా వైద్యులు కృషి చేయాలని సీనియర్ సివిల్‌జడ్జి కరుణ కుమార్ అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ ప్రజలు అనారోగ్య బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలతో ప్రతి ఒక్కరికీ అవసరమైన ఆరోగ్య సేవలు అందించాలన్నారు. సమాజంలో ఆరోగ్యకరంగా జీవించేందుకు 9 ఆరోగ్య సూత్రాలను పాటించాలని, వాటిపై ప్రజలకు అవగాహ న కల్పించాలని సూచించారు. ఇన్‌చార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రవిరాజు మాట్లాడు తూ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యసేవల ను అందిస్తోందని, వాటిని ప్రజలు సద్వినియో గం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు వ్యా పిస్తే తక్షణం స్పందించాలన్నారు. అధికారులు అ నిల్, గుణ శేఖర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

విజయానందం



డెయిరీ ఆవరణలో జరుగుతున్న ప్రాసెసింగ్ యూనిట్ భవన నిర్మాణ పనులు



తుదిదశకు చేరిన వే బ్రిడ్జి పనులు

ఆసియాలోనే గుర్తింపు పొంది, ఉమ్మడి చిత్తూరు జిల్లాకే మణిహారంగా నిలిచిన విజయా డెయిరీ ఎంతోమంది పాడిరైతులకు ఆపద్బాంధవిగా ఉండేది. అయితే ఈ డెయిరీని రెండు దశాబ్దాల కిందట చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే నిర్వీర్యం చేశారు. తన సొంత సంస్థ అయిన హెరిటేజ్ కోసం విజయా డెయిరీని ఉన్నఫళంగా మూసివేశారు. దీంతో పాడి రైతులు దిక్కుతోచని స్థితిలో వీధిన పడ్డారు. గతంలో వైఎస్ జగన్ చిత్తూరు పర్యటనకు విచ్చేసినప్పుడు ఇదే విషయాన్ని పాడిరైతులు వివరించారు. అధికారంలోకి వస్తే డెయిరీని తెరిపిస్తామని ఇచ్చిన హామీ మేరకు విజయా డెయిరీకి జగనన్న ప్రభుత్వం ఊపిరి పోస్తోంది.

- గతంలో జిల్లాకే తలమానికంగా విరాజిల్లిన విజయా డెయిరీ
- చంద్రబాబు తన సొంత సంస్థ హెరిటేజ్ కోసం డెయిరీని నిర్వీర్యం చేసిన వైనం
- ఫలితంగా నట్టేట మునిగిన పాడి రైతులు
- రెండు దశాబ్దాల పాటు కార్మికుల నిరీక్షణ
- డెయిరీ పునఃప్రారంభానికి సీఎం జగన్ శ్రీకారం



నిర్మాణ దశలో ఉన్న డెయిరీ ప్రధాన గేటు

చిత్తూరు అగ్రికల్చర్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలిచిన విజయా డెయిరీకి ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం ఊపిరి పోసింది. డెయిరీ పునఃప్రారంభానికి సీఎం జగన్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దీంతో ఎంతోమంది పాడి రైతులకు బాసటగా నిలవనుంది. నగర పరిధిలో 1969లో సహకార కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయా డెయిరీని ప్రారంభించారు. అప్పట్లోనే రోజుకు 3 వేల లీటర్ల పాలను సేకరించి, చిత్తూరు, తిరుపతి నగరాల్లో విక్రయించేవారు. అటు తరువాత 1977–78 నుంచి తిరుమల స్వామివారి అభిషేకానికి కూడా విజయా డెయిరీ పాలను సరఫరా చేసేవారు. తిరుమలలోని పలు హోటళ్లు, క్యాంటీన్ల నిర్వాహకులు కూడా ఈ పాలనే కొనుగోలు చేసేవారు. 1980 నుంచి ఏడాదికి రోజుకు 50 వేల లీటర్ల పాల సేకరణ సామర్థ్యం పెరగడంతో డెయిరీ ఆవరణలో పాల కోవా, రోస్‌మిల్క్ తయారు చేసే యూనిట్లను కూడా ఏర్పాటు చేశారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో డెయిరీకి మరింత ప్రోత్సాహం లభించడంతో తిరుమలకు నెలకు రూ.కోటి మేరకు నెయ్యి సరఫరా చేయడంతో పాటు, పాలకోవా, రోస్ మిల్క్ విక్రయ కేంద్రాలను చిత్తూరు, తిరుపతి, తిరుమల నగరాల్లో ఏర్పాటు చేశారు. అంతేగాకుండా డెయిరీ నుంచి పాల పౌడర్‌ను మిలిటరీ క్యాంటీన్లకు తరలించే వారు. డెయిరీ సామర్థ్యం మరింతగా పెరగడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 1.20 లక్షల మంది పాడి రైతులు కుటుంబాలు రోజుకు దాదాపు 3.50 లక్షల లీటర్ల పాలను సరఫరా చేసి జీవనం సాగించే వారు. దీంతో వి.కోట, మదనపల్లె, పీలేరు, శ్రీకాళహస్తి, పిచ్చాటూరులో శీతలీకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి నిత్యం పాలను సేకరించే వారు. డెయిరీకి రైతులను మరింత చేరువ చేస్తూ గ్రామాల్లో పాడి రైతులతో కూడిన పాల ఉత్పత్తి దారుల సహకార సంఘాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ సంఘాల ఆధ్వర్యంలో దాదాపు 850 గ్రామాల్లో పాల ఉత్పత్తి దారుల సంఘం కింద పాల సేకరణ భవనాలను నిర్మించారు. ఇందుకోసం అప్పటి ప్రభుత్వం సహకారం అందించడంతో పాల ఉత్పత్తిదారుల వాటా కూడా ఉంది. 1988లో విజయా డెయిరీలో కార్మిక యూనియన్‌ను కూడా ఏర్పాటు చేశారు.

డెయిరీ నిర్వీర్యం ఇలా....

జిల్లాకే తలమానికంగా నిలిచిన విజయా డెయిరీని చంద్రబాబునాయుడు సహకార శాఖ మంత్రిగా పనిచేసే రోజుల్లో సందర్శించారు. అప్పటికి రోజుకు 4 లక్షల లీటర్ల మేరకు పాల సేకరణ జరిగేది. డెయిరీలో దాదాపు 800 మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేసేవారు. డెయిరీ నుంచి ఢిల్లీ, పుణే, ముంబై తదితర మహా నగరాలకు రోజుకు 2 లక్షల లీటర్ల పాలను రేణిగుంట రైల్వే జంక్షన్ నుంచి రైలు ద్వారా రెండు ప్రత్యేక బోగీలు ఏర్పాటు చేసి తరలించేవారు. ఇది గమనించిన చంద్రబాబుకు తన మనసులో ఎక్కడో దుర్బుద్ధి పుట్టింది. వెంటనే తాను సొంతంగా హెరిటేజ్ డెయిరీని ఏర్పాటు చేసుకున్నారు. విజయా డెయిరీలో అప్పట్లో మేనేజర్‌గా పనిచేస్తున్న ఓ అధికారి సహకారంతో విజయా డెయిరీకి వచ్చే పాలను హెరిటేజ్‌కు మళ్లించే పనులు చేపట్టారు. మరోవైపు విజయా డెయిరీలో పాల పౌడర్, నెయ్యిని విక్రయించకుండా నిల్వ ఉంచారు. అమ్ముడుపోలేదంటూ నిల్వ ఉన్న పాల పౌడర్, నెయ్యిని టెండర్ ద్వారా విక్రయించి డెయిరీని నష్టాల పాలు చేశారు. డెయిరీకి పాల సేకరణ ఎక్కువగా ఉందంటూ వారానికి రెండు రోజుల పాటు మిల్క్ హాలిడేను ప్రకటిస్తూ, హెరిటేజ్‌కు పాలను మళ్లించుకున్నారు. తనకు అనుకూలంగా ఉన్న దొరబాబును డెయిరీ కార్మిక సంఘం నాయకుడిగా నియమించుకున్నారు. ఆఖరికి నష్టాలు చూపి 2002లో ఆగస్టు 31న డెయిరీని పూర్తిగా మూసి వేయించారు. దీంతో డెయిరీని నమ్ముకుని జీవనం సాగిస్తున్న పాడి రైతుల కుటుంబాలు, కార్మికుల బతుకులు వీధిన పడ్డాయి.

పునరుజ్జీవం ఇలా...

2018లో చిత్తూరు పర్యటనకు విచ్చేసిన జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి రైతులు, కార్మికులు డెయిరీ పరిస్థితిని తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన అధికారంలోకి రాగానే డెయిరీని తిరిగి తెరిపించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం డెయిరీ పునఃప్రారంభానికి ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వెంటనే డెయిరీకి ఉన్న అప్పులు రూ.182 కోట్లను ప్రభుత్వమే చెల్లించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా పాడి రైతులను ఆదుకోవాలన్న తలంపుతో పటిష్టమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. రూ.385 కోట్లతో డెయిరీ అభివృద్ధికి ముందుకు వచ్చిన అమూల్ సంస్థతో ప్రభుత్వం 99 ఏళ్ల పాటు లీజు ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో గత ఏడాది జూలైలో డెయిరీని పునఃప్రారంభించే పనులకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి డెయిరీ పనులను అమూల్ సంస్థ చర్యలు వేగవంతం చేసింది. ఇప్పటికే రూ.35 కోట్లు వెచ్చించి డెయిరీ ఆవరణలో 20 లక్షల లీటర్ల సామర్థ్యం గల ప్రాసెసింగ్ భవన నిర్మాణ పనులు చేపడుతోంది. త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేసి డెయిరీని పునఃప్రారంభించే పనులు శరవేగంగా చేపడుతున్నారు. దీంతో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా పాడి రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పాడి రైతులను ఆదుకున్నారు



విజయా డెయిరీని తిరిగి తెరిపించి, పాడి రైతులను ఆదుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా అత్యధికంగా రైతులు పాడిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో ఇందుకు విజయా డెయిరీ వీరికి అండగా ఉండేది. చంద్రబాబు స్వార్థం కోసం డెయిరీని మూసివేసి మాలాంటి పాడి రైతులను నట్టేట ముంచారు.

– హేమచంద్ర, పాడి రైతు, బైరెడ్డిపల్లె మండలం

చాలా సంతోషంగా ఉంది



చిత్తూరు విజయా డెయిరీని తిరిగి ప్రారంభించడం చాలా సంతోషంగా ఉంది. ప్రస్తుతం నేను రెండు ఆవులను మేపుకుంటూ రోజు 10 లీటర్ల మేరకు మహిళా సంఘాల డెయిరీకి పాలు పోస్తున్నా. పాడి ఆవులే మాకు జీవనాధారం. చిత్తూరు డెయిరీ తిరిగి తెరిపిస్తే పాలకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని అనుకుంటున్నాం.

– లక్ష్మి, పాడి రైతు, పాలసముద్రం మండలం

ఆశలు చిగురించాయి



విజయా డెయిరీ పునఃప్రారంభం కానుండడంతో ఆశలు చిగురిస్తున్నాయి. అమూల్ సంస్థ ఆధ్వర్యంలో డెయిరీని నిర్వహించడం వల్ల పాలకు మంచి గిట్టుబాటు ధర వస్తుందనుకుంటున్నాం. ఇప్పటికే జిల్లాలోని పలుచోట్ల గిట్టుబాటు ధర ఇస్తున్నారు. ప్రైవేటు డెయిరీల దోపిడీకి కొంతమేర చెక్ పడింది.

– నిర్మల, మహిళా పాడి రైతు, పెనుమూరు

మాటల గారడీ చేయడమే బాబు నైజం



దిగువపల్లెలో సిద్ధం సభకు హాజరైన మహిళలు



సిద్ధం సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- సూపర్ సిక్స్ అంటూ మరోసారి మోసం చేయడానికి బాబు వస్తున్నాడు
- సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులాంటివి
- అర్హతే ప్రామాణికంగా పథకాలు కొనసాగిస్తాం
- మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె: ''సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైఎస్సార్ సీపీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వ లేక ఎన్నో కుట్రలు, కుతంత్రాలు, పొత్తులతో చంద్రబాబు నాయుడు జత కట్టాడు.. మరోమారు ప్రజలను మోసం చేసేందుకు సూపర్ సిక్స్ పేరిట వస్తున్నాడు.. ప్రజలారా జాగ్రత్త.. నమ్మి మోసపోకండి'' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చౌడేపల్లె మండలంలో సిద్ధం పేరిట 19 పంచాయతీల్లో జరిగిన సభల్లో ఆయన చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మహిళలకు అభివాదం చేస్తూ పర్యటించారు. పర్యటనలో మంత్రికి మహిళలు నీరాజనాలు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో 600 అబద్ధపు హామీలతో 100 పేజీల మేనిఫెస్టోను చంద్రబాబు నాయుడు విడుదల చేసినా, వాటిని అమలు చేయకుండా జన్మభూమి కమిటీల పెత్తనంతో దోచుకున్నారన్నారు. రాష్ట్రచరిత్రలో ఇచ్చిన హామీలను 100 శాతం నెరవేర్చి ప్రజలను నేరుగా ఓట్లు అడిగే అర్హత ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకే తెచ్చిన ఘనత తమదే అన్నారు. గ్రామంలోని ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి, వారి ద్వారా సంక్షేమ పథకాలు అందించే కార్యక్రమం దేశ చరిత్రలో ఎక్కడా అమలు చేయలేదన్నారు. అలాంటి గొప్ప కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటు చేశారని కొనియాడారు. రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసి వైద్యసేవల కోసం కొత్తగా 58 వేల పోస్టులను భర్తీ చేశారని గుర్తుచేశారు. విద్య కోసం నాడు–నేడు ద్వారా రూ.27 వేల కోట్ల నిధులు ఖర్చు చేశారన్నారు.

పుంగనూరును ఆదర్శంగా మార్చేశాం..

ఈప్రాంతాన్ని గతంలో 30 ఏళ్లపాటు తండ్రి, కొడుకులు పాలించారని కానీ, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచారని, అలాంటి ఈ ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆదర్శంగా తీర్చిదిద్దామని తెలిపారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రెండవసారి ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, జగన్‌మోహన్‌రెడ్డిని రెండవ సారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజరెడ్డి, మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, పార్టీ కన్వీనర్ అంజిబాబు, పాల ఏకరి రాష్ట్ర డైరెక్టర్ లడ్డూరమణ, మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, వెంకటరెడ్డి, రెడ్డిప్రకాష్, నేతలు మహమ్మద్‌షఫీ, నాగభూషణరెడ్డి, అల్తాఫ్, చెంగారెడ్డి, రమేష్ బాబు, మునికృష్ణమ నాయుడు, రఘుపతినాయుడు, శ్రీధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, ఆనందాచార్యులు, రమణారెడ్డి, ప్రమోద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లె: మండలకేంద్రంలోని సంతగేటు సమీపంలో ఉన్న మజీద్‌ఈ షాకీర్ మసీదులో ఆదివారం రాత్రి ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఆయనకు ముస్లిం మైనారిటీలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి టోపీ ధరించి పవిత్రమైన రంజాన్ మాసంలో దువ్వా చేపట్టారు. కార్యక్రమంలో మైనారిటీ నేతలు అల్తాఫ్, సద్దాం, హయ్యాఖాన్, మహమ్మద్ అలీ, హస్సేన్, వహాబ్ తదితరులు ఉన్నారు.



చౌడేపల్లె ఇఫ్తార్ విందులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పేదల కోసం మళ్లీ జగనన్నే రావాలి

- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: పేదవాడి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నా.. పేద పిల్లలకు ఇంగ్లిషు మీడియం విద్య అందాలన్నా మళ్లీ జగనన్నే రావాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని పచ్చికాపల్లం, కొమరగుంట పంచాయతీల్లో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గడిచిన 58 నెలల కాలంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వాస్పత్రుల ఆధునీకరణ, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలతో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ప్రధానంగా గ్రామాల్లో పెద్ద ఎత్తున సిమెంటు, తారురోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. పెనుమూరు, కార్వేటినగరం మండలాల్లో 50 పడకల ఆస్పత్రులు మంజూరు చేయించినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత విద్య అందించాలన్న ఉద్దేశంతో వెదురుకుప్పం మండలంలోని పచ్చికాపల్లంలో డిగ్రీ కళాశాల మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పేదవానికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్టు పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా జలజీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంకుల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. అందరూ జగనన్న అందించిన సంక్షేమ పాలనను గుర్తు చేసుకుని మళ్లీ అందరి తలరాతలు బాగు పడాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలని అభ్యర్థించారు.

వాస్తవాలు తెలుసుకోకుండా రాయడం సరికాదు

- ఎల్లోమీడియాలో వార్తపై మండిపాటు
- టపాసుల రవ్వలు పడడంతో ప్రమాదం
- సీఎండీ సంతోషరావు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎండీ సంతోషరావు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో జిల్లా స్టోర్‌లో జరిగిన అగ్ని ప్రమాద సంఘటన స్థలాన్ని ఆదివారం సీఎండీ సంతోషరావు పరిశీలించారు. ఘటన జరగడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు టపాసులు కాల్చడంతో ఆ నిప్పురవ్వల వల్ల స్టోర్‌లో ప్రమాదం జరిగిందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, కేబుళ్లు కాలడంతో దాదాపు రూ.15 లక్షల వరకు నష్టం వచ్చిందన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎల్లోమీడియాలో రూ.కోటికి పైగా నష్టం వచ్చిందని రాయడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాదం జరిగిన కొద్ది నిమిషాల్లో సిబ్బంది అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారన్నారు. స్టోర్‌లో కోట్లాది రూపాయాల విద్యుత్ పరికరాలు నిల్వ ఉంటాయని, భవిష్యత్‌లో భద్రతా ప్రమాణాలు పెంచుతామని తెలిపారు. అదేవిధంగా ఎస్‌పీఎం నూతన భవనంలోకి వెళ్లాక స్టోర్‌కు ఆ కార్యాలయాలను అనుసంధానం చేస్తామన్నారు. నూతన రోడ్డు, డీఈ కార్యాలయం నిర్మాణానికి గతంలో అనుమతులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈలు గంగాధరం, పద్మనాభపిళ్లై, డీఈలు జయప్రకాష్, శేషాద్రి, జ్ఞానేశ్వర్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఈవీఎంల ర్యాండమైజేషన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ నుంచి 14 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు పకడ్బందీగా కసరత్తు చేస్తున్నారు. కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో ఈవీఎంలను అత్యంత బందోబస్తు నడుమ భద్రపరిచారు. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా పెట్టారు. ర్యాండమైజేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించేందుకు కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే గత ఏడాది నవంబర్ 10వ తేదీన మొదటి స్థాయి ఈవీఎం ఫస్ట్ లెవల్ చెక్‌ను అధికారులు పూర్తి చేశారు. ఈ ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి బ్యాలెట్ యూనిట్లు 2348, కంట్రోల్ యూనిట్లు 2263, వీవీప్యాట్లు 2541 మొత్తం 7152, అలాగే అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి బ్యాలెట్ యూనిట్లు 2360, కంట్రోల్ యూనిట్లు 2263, వీవీప్యాట్లు 2541 మొత్తం 7164 ఓటింగ్ యంత్రాలను వినియోగించనున్నారు.

క్లుప్తంగా

రైల్వే ఉద్యోగి సస్పెన్షన్



పుంగనూరులో టీడీపీ అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్న రైల్వే ఉద్యోగి వాసుదేవరెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

పుంగనూరు: చౌడేపల్లె మండలం వడ్డివారిపల్లె నివాసి వై.వాసుదేవరెడ్డి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కాటిపేరి ప్రచారంలో పాల్గొని అడ్డంగా దొరికిపోయి ఆదివారం సస్పెండ్ అయ్యాడు. దక్షిణ రైల్వేశాఖ అధికారులు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విచారణ జరిపి, చర్యలు చేపట్టారు. కాగా ఈ విషయాలను శనివారం సాక్షి పత్రికలో ఫొటోతో సహా ప్రచురించడంతో ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంది.

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయంలో భక్తుల రద్దీతో క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓచంద్రమౌళి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

కిడ్నీ బాధితులకు అండగా..

కిడ్నీ రోగులకు సరైన వైద్యం అందక, చికిత్స కోసం దూర ప్రాంతాలకు ప్రయాణం చేయలేక, ఆర్థిక స్తోమతతో ఇబ్బంది పడే కిడ్నీ బాధితుల యాతన అంతాఇంతా కాదు. వారి దీనస్థితిని చూసి చలించిన మంత్రి ఆర్కే రోజా నగరిలోనే డయాలసిస్ వార్డు ఏర్పాటు చేయించాలని సంకల్పించారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో ఆ దిశగా అవిశ్రాంత కృషి చేస్తూ వచ్చారు. ప్రస్తుతం నగరి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ అందుబాటులోకి వచ్చింది.

- నగరిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు
- ఫలించిన మంత్రి ఆర్‌కే రోజా కృషి
- కిడ్నీ బాధితులకు సీఎం జగన్ సర్కారు అండ
- రూ.10 వేల పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్న ప్రభుత్వం
- వ్యయ, ప్రయాసలు తగ్గడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న కిడ్నీ బాధితులు



నగరి ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు

నగరి : రాష్ట్రవ్యాప్తంగా డయాలసిస్ రోగులను ఆదుకోవడానికి డయాలసిస్ సెంటర్లు పెంచేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికను రచించింది. రాష్ట్రవ్యాప్తంగా 61 డయాలసిస్ సెంటర్లు పెట్టి వాటి ద్వారా 515 డయాలసిస్ పరికరాలు అందుబాటులోకి తెచ్చి రాష్ట్రంలో పది వేలకు పైగా కిడ్నీ బాధితుకు లబ్ధి చేకూర్చే పనులను వేగంగా మొదలుపెట్టింది. ఇందులో భాగంగా నగరి ఏరియా ఆస్పత్రికి డయాలసిస్ సెంటర్‌ను తీసుకురావడంతో మంత్రి ఆర్కే రోజా సఫలీకృతులయ్యారు. రూ.50 లక్షల వ్యయంతో ఐదు డయాలసిస్ యంత్రాలతో నగరిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నగరి రాజకీయ చరిత్రలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మంత్రి ఆర్‌కే రోజా డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో మరోమెట్టు పైకెక్కారు. నగరి నియోజకవర్గంతో పాటు పరిసర నియోజకవర్గాల నుంచి సుమారు 500 రోగులు డయాలసిస్ వార్డులో ప్రస్తుతం సేవలు అందుకుంటున్నారు. ఇదివరలో స్థానికంగా డయాలసిస్ వార్డు లేకపోవడంతో పేషంట్లు చెన్నై, తిరుపతి, చిత్తూరు, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. డయాలసిస్ అనేది నిరంతర ప్రక్రియ కావడంతో ప్రైవేటు వాహనాలకు బాడుగల చెల్లింపు రూపంలో అధిక మొత్తంలో ఖర్చుచేయాల్సి రావడం, అలా వాహనాల్లో వెళ్లి తిరిగి వచ్చేసరికి అలసిపోయేవారు.

వ్యయప్రయాసలకు ఓర్చి..

కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారు వారానికి మూడు లేదా నాలుగుసార్లు డయాలసిస్ చేసుకోవాల్సి వస్తుండగా ఇందుకు రూ.10 వేల నుంచి రూ.12వేలు ఖర్చు పెట్టుకునేవారు కూడా ఉన్నారు. నగరిలోనే డయాలసిస్ ఏర్పాటు చేస్తుండడంతో కిడ్నీ బాధితుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. నేడు వారు స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఉచితంగా డయాలసిస్ చేసుకుంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మనసుతో విన్నారు..



ఐదేళ్లుగా చెన్నైకి వెళ్లి డయాలసిస్ చేయించుకుని వస్తున్నా. ప్రైవేటు వాహనంలో ఒకసారి వెళ్లడానికి రూ.4 వేల దాకా ఖర్చవుతుంది. ప్రస్తుత ప్రభుత్వం అంబులెన్స్ ఏర్పాటు చేసి తిరుపతికి తీసుకెళ్లి డయాలసిస్ చేయించి తిరిగి తీసుకువచ్చే సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ప్రయాణ బాధలు కూడా లేవు. మా ఇబ్బందులను రోజమ్మ మనసుతో విన్నారు. నగరిలో డయాలసిస్ చేసుకునే అవకాశం కల్పించారు. కిడ్నీ సమస్య వల్ల ఐదారేళ్లుగా నేత పని చేయడం లేదు. మగ్గాలు కూడా అమ్మేశా. ప్రభుత్వం అందించే రూ.10 వేలు పెన్షన్ నన్ను ఆదుకుంటోంది. ప్రస్తుతం నగరిలోనే డయాలసిస్ సెంటర్ పెట్టడం చెప్పలేనంత సంతోషాన్ని ఇస్తోంది. **- గణేశ్, చింతలపట్టెడ, నగరి మున్సిపాలిటీ**

ఆనందం మాటల్లో చెప్పలేను..



నగరిలో డయాలసిస్ సెంటర్ పెట్టడంతో వచ్చిన ఆనందం మాటల్లో చెప్పలేను. వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాలి. ఇదివరలో తిరుపతికి వెళ్లేవాళ్లం. ముఖ్యమంత్రి సాయంతో అంబులెన్స్‌లో తీసుకెళ్లి డయాలసిస్ చేసి తీసుకువచ్చేవారు. మూడుసార్లు వెళ్లి రావాలంటే ఒళ్లు అలసిపోయేది. ప్రస్తుతం నగరిలోనే డయాలసిస్ సెంటర్ పెట్టారు. ఇది మేమున్న ప్రాంతానికి రెండుకిలోమీటర్ల దూరం. ఏ ఇబ్బంది లేకుండా ఇక్కడకు వచ్చి డయాలసిస్ చేసుకుని వెళ్తున్నా. ముఖ్యమంత్రి జగన్‌కు, మంత్రి రోజమ్మకు ధన్యవాదాలు.

- బాలకృష్ణ, నెత్తం కండ్రిగ, నగరి మున్సిపాలిటీ

రోజమ్మ చల్లగా ఉండాలి..



డయాలసిస్ కోసం నేను పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. ఇదివరలో డయాలసిస్ కోసం తిరుపతికి వెళ్లాలి. ప్రైవేటు వాహనాల్లో వెళ్లలేను. బస్సులోనే వెళ్లాలి. బస్సులో వెళ్లాలంటే కండక్టర్లు, డ్రైవర్లు కూడా విసుక్కునేవారు. అయితే జగన్ ప్రభుత్వం అంబులెన్స్ పెట్టి తీసుకెళ్లి డయాలసిస్ చేసి తీసుకువచ్చే వీలు కల్పించింది. రూ.10 వేలు పింఛను ఇంటి వద్దకే వచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు రోజమ్మ నగరిలోనే డయాలసిస్ సెంటర్ పెట్టించారు. నాలాంటి వారిపై భగవంతుడు చూపిన దయే ఆమె చేత ఈ మహత్కార్యాన్ని చేయించింది. ఆమె చల్లగా ఉండాలి.

- శంకరయ్య, వేలావడి ఎస్టీకాలనీ, నగరి మండలం

ఈ సేవలే ఆమెకు ఆశీస్సులు



ఏడాదిన్నర కాలంగా డయాలసిస్ చేసుకుంటున్నాను. మాది విజయపురం. అక్కడి నుంచి నగరికి వచ్చి ఇక్కడి నుంచి తిరుపతికి వెళ్లి డయాలసిస్ చేసుకుని మళ్లీ ఇంటికి చేరుకోవడం చాలా ఇబ్బందిగా ఉండేది. అది మాటల్లో చెప్పడానికి వీలుపడదు. నగరిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం మాలాంటి వారికి భగవంతుడు ఇచ్చిన వరమే. మా కష్టాలు చూసి జగనన్న రూ.10 వేలు పెన్షన్ అందిస్తుంటే రోజమ్మ మాకు అందుబాటులో డయాలసిస్ సెంటర్ పెట్టి సేవ చేస్తోంది. ఈ సేవలే ఆమెకు ఆశీస్సులు.

- సుచీంద్రన్, విజయపురం

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



గడ్డంవారిపల్లెలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నేతలు

చౌడేపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ కార్యాక్రమాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీకి చెందిన 50 మంది నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. మండలంలో ఆదివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిద్ధం ఎన్నికల ప్రచారాన్ని చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ముడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలిసి నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఏ.కొత్తకోటకు చెందిన పవన్‌కుమార్, అనిల్‌బాషా, రాకేష్, నవీన్, లోకేష్, సంతోష్, విజయ్‌కుమార్ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆమినిగుంటలో గంగాధరం, గురుపాదం, రెడ్డెప్ప, గురుప్రసాద్, గడ్డంవారిపల్లెలో హరీష్, హరినాథరెడ్డి, చంద్రశేఖర్, చరణ్‌కుమార్, హరిప్రసాద్, రెడ్డెప్ప, చిన్నప్పలతోపాటు మరో పది మంది పార్టీలో చేరారు. అలాగే నడుమూరులో వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాగరాజ, అశోక్, వెంకట్రమణ, సుబ్రమణ్యం, చంద్ర, వెంకట్రమణ, నరసింహులు, సుబ్రమణ్యం, వెంకట్రమణ, కొండామర్రిలో వెంకట్రమణ తదితరులు పార్టీలో చేరారు. వీరందరికీ మంత్రి పెద్దిరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, నరసింహులు యాదవ్, పార్టీ కన్వీనర్ అంజిబాబు, జేసీఎస్ కన్వీనర్ రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, బోయకొండ చైర్మన్ నాగరాజారెడ్డి, మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మిద్దింటి కిషోర్‌బాబు, జంగమ, వీరశైవ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు ఠానాధార్ నాగరాజ ఉన్నారు.



గడ్డంవారిపల్లెలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన యువత

గుడుపల్లెలో..

గుడుపల్లె: మండలంలోని గుడ్లసాగరం గ్రామ పంచాతీలో 35 కుటుంబాలు, కొడతనపల్లె, ఆవుల తిమ్మనపల్లె, సొలచింతనపల్లె గ్రామాలలో 45 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఆర్‌జే భరత్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఏమైన కావాలంటే కార్యాలయాల చుట్టూ టీడీపీ నాయకుల చుట్టూ తిరిగేవాళ్లమని, అయినా కూడా అర్హులైన లబ్ధిదారులకు పథకాలు అందేవి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణమూర్తి, వేణుగోపాల్, మునిరత్నం, సర్పంచ్ నాగరాజు, రామమూర్తి, బాబు, దేవా, మోహన్, నాయకులు పాల్గొన్నారు.



గుండ్లసాగరంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో భరత్

నల్లారి, చల్లాబాబుపై ఫిర్యాదు



రొంపిచెర్ల సర్కిల్‌లో ప్రచార వాహనంపై ప్రసంగిస్తున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల: మాజీ ముఖ్యమంత్రి , రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి, పుంగనూరు టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిపై ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఇబ్రహీంఖాన్ ఆదివారం రాత్రి మండల ఎన్నికల అధికారులు షేక్ మోహీద్దీన్, రెడ్డెప్పచారికి ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి టీడీపీ, బీజేపీ నేతలు రొంపిచెర్లలో విఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రొంపిచెర్ల సర్కిల్‌లో ప్రచార వాహనంపై బహిరంగ సమావేశంలో ప్రసంగించారు. అయితే ఎలాంటి అనుమతి లేకుండానే టీడీపీ, బీజేపీ అభ్యర్థులు ప్రచార వాహనం పైనుంచి మాట్లాడడంపై స్థానిక వైఎస్సార్‌సీపీ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

బాలికపై అత్యాచారం





ఆత్మహత్య చేసుకున్న బాలిక(ఫైల్), అత్యాచారానికి పాల్పడిన నిందితుడు గణేష్

పుంగనూరు: ఇటుకల బట్టీలో పనికి తీసుకెళ్లి బాలికపై అత్యాచారం చేయడంతో అవమానంతో బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కమతంపల్లి గ్రామానికి చెందిన చెందిన ఆనంద్, ధనలక్ష్మి దంపతుల కుమార్తె హేమలత (17). బాలిక తన తల్లితో కలిసి అదే గ్రామానికి చెందిన గణేష్‌తోపాటు ఇటుకల బట్టీలో పనికి వెళ్లింది. ఈ సమయంలో గణేష్ ఆ బాలికపై కన్నేశాడు. కేకలు వేయడంతో బాలిక తల్లి కుమార్తెను కాపాడే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో నిందితుడు గణేష్ పరారయ్యాడు. ఇలా ఉండగానే బాలిక తీవ్ర మనస్తాపానికి గురై ఇటుకల బట్టీ వద్ద ఉన్న చెట్టుకు ఉరి వేసుకుంది. వెంటనే తల్లి, గ్రామస్తులు కలసి కాపాడే ప్రయత్నం చేశారు. కానీ ఫలితం లేకపోయింది. బాలిక అప్పటికే మృతి చెందడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ మేరకు బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఈతకు వెళ్లి అన్నదమ్ములు మృతి





అభినాష్, అశ్విన్ (ఫైల్)



సదుం: రోదిస్తున్న తల్లిదండ్రులు

సదుం: ఈతకు వెళ్లి అన్నదమ్ములు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. చెరుకువారిపల్లెకు చెందిన శరవణ, భాను దంపతులు. వ్యాపారరీత్యా సదుం మండల కేంద్రం కాలేజీరోడ్డులో ఉంటున్నారు. వీరికి అభినాష్(14), అశ్విన్ (13) సంతానం. వీరు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 8 తరగతులు చదువుతున్నారు. మధ్యాహ్నం భోజనం చేసి ఈత నేర్చుకునేందుకు స్థానికంగా ఉన్న మరో ఇద్దరితో కలసి నడిగడ్డ పంచాయతీ పరిధిలోని రఘుపతి చెరువుకు వెళ్లారు. అక్కడ ఈత నేర్చుకునే క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగారు. వారితో పాటు ఈతకు వెళ్లిన వారు రోడ్డుపైకి వచ్చి సమాచారం ఇవ్వడంతో స్థానికులు వచ్చి మునిగిన ఇద్దరినీ వెలికితీశారు. హుటాహుటిన సదుం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ మారుతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఇద్దరు కుమారులు ఒకేసారి మృతి చెందడంతో ఆస్పత్రిలో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు కంటతడి పెట్టించాయి.

ఒంటరి ఏనుగు బీభత్సం



ఇనుప గేటును విరిచేసిన ఒంటరి ఏనుగు

ఐరాల: మండలంలోని చుక్కావారిపల్లెలో ఆదివారం వేకువజామున ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. బాబు అనే రైతుకు చెందిన మామిడి తోటకు ఏర్పాటు చేసిన ఇనుప గేటును ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించింది. మామిడి కొమ్మలను విరిచేసి, కొబ్బరి చెట్లను కూలదోసింది. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను కట్టడి చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

తిరుపతి క్రైమ్ : తిరుపతిలోని పలు ఆస్పత్రుల్లో చోరీలకు పాల్పడిన నిందితుడు దేవా మహేష్(41)ను ఆదివారం అరెస్ట్ చేసినట్లు వెస్ట్ సీఐ జయనాయక్ తెలిపారు. నగరంలోని సంజీవయ్య నగర్ కు చెందిన దేవా మహేష్ ఇటీవల స్విమ్స్, రమాదేవి ఆస్పత్రుల్లో చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. నిందితుడు భారతీయ విద్యా భవన్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. నిందితుడి నుంచి రూ.6,44,500 విలువైన 129 గ్రాముల బంగారం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

లక్ష్యం చేరని రిజిస్ట్రేషన్ శాఖ

- ఏడాది లక్ష్యం రూ.181 కోట్లు
- ఆదాయం రూ.92.52 కోట్లు



జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో రిజిస్ట్రేషన్‌శాఖ వార్షిక లక్ష్యం చేరుకోలేకపోయింది. 2023–24 ఏడాది లక్ష్యం రూ.181 కోట్లుగా నిర్దేశించగా రూ.92.25 రిజిస్ట్రేషన్ల రూపంలో ఆదాయంగా వచ్చింది. భూ లావాదేవీల పరంగా క్రయవిక్రయాలు తగ్గడంతో ఆదాయ లక్ష్యం చేరుకోలేదని అధికారులు అంటున్నారు. ప్రతి సంవత్సరం భూముల ధరలు పెంచే విధంగా ఈసారి ప్రాంతాలను బట్టి విలువను పెంచారు. కానీ ఆదాయం ఆశించిన స్థాయిలో రాలేదు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా లక్ష్యం, వచ్చిన ఆదాయం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం	లక్ష్యం రూ.కోట్లు	ఆదాయం రూ.కోట్లు
చిత్తూరు ఆర్‌ఓ	రూ.58.93	రూ.29.53
చిత్తూరు రూరల్	రూ.13.09	రూ.6.91
బంగారుపాళ్యం	రూ.8.85	రూ.5.67
కుప్పం	రూ.21.83	రూ.14.03
పలమనేరు	రూ.30.14	రూ.16.09
పుంగనూరు	రూ.28.32	రూ.14.24
కార్వేటినగరం	రూ.7.09	రూ.3.82
నగరి	రూ.13.48	రూ.5.92